

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని సన్మానిస్తున్న కేఎల్‌యూ ప్రొఫెసర్ ఎంపీ మల్లేశం, ఏబీవీ, గాయత్రి కళాశాలల ప్రిన్సిపాళ్లు కనకరాజు, శ్రీనివాస్, నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్ పందిళ్ల అశోక్‌కుమార్

జనగామ, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : ప్రతి ఒక్కరినీ లక్ష్యానికి అనుగుణంగా తీర్చిదిద్ది, వారి కలలను నిజం చేసే బాధ్యతను కేఎల్ యూనివర్సిటీ తీసుకుంటుందని ప్రొఫెసర్ డాక్టర్ ఎంపీ మల్లేశం అన్నారు. ఆదివారం నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'ఇంటర్ తర్వాత ఉన్నత విద్యా అవకాశాలు' అంశంపై 'లక్ష్యం-2024' పేరిట జనగామ జిల్లాకేంద్రంలోని ఎస్‌ఎస్‌ఎన్ ఫంక్షన్ హాల్‌లో జనగామ ఏబీవీ జూనియర్ కాలేజీ, శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 500మందికి పైగా విద్యార్థులు హాజరైన కార్యక్రమంలో ఇంటర్మీడియట్ తర్వాత ఏయే కోర్సులు చదవాలి? ఎటువైపు వెళ్తే జీవితంలో స్థిరపడి ఉత్తమ ఉద్యోగం చేయవచ్చు? అనే అంశాలపై కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సహా ఏబీవీ జూనియర్ కాలేజీ, శ్రీగాయత్రి జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు కనకరాజు, శ్రీనివాసులు దిశానిర్దేశం చేశారు.



నమస్తే తెలంగాణ, తెలంగాణ టు డే ఆధ్వర్యంలో అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు.. ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మల్లేశం

# ఆత్మవిశ్వాసంతో ఎదగాలి..

## ఉజ్వల భవిష్యత్తుకు డ్యుయల్ డిగ్రీ పునాది

- పోటీ ప్రపంచంలో ముందస్తు ప్రణాళిక ఎంతో ప్రధానం
- ఉన్నత చదువులు, మెరుగైన ఉద్యోగావకాశాలు కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులకే సాధ్యం
- డిగ్రీ నాలుగేండ్లు కష్టపడి చదివితే.. 40 ఏండ్లు మంచి జీవితమే
- కేఎల్‌యూలో ఒకేసారి రెండు కోర్సులు చదివే అవకాశం
- విద్యార్థులకు ఐదు ఫారెన్ లాంగ్వేజీలపై ఉచిత శిక్షణ
- ఆన్‌లైన్-ఆఫ్‌లైన్‌లో జేఈఈ బేసిక్ ఎగ్జామ్
- అపాయింట్‌మెంట్ ఇచ్చే స్థాయికి చేరుకోవాలి
- లక్ష్యం దిశగా అడుగులు వేయాలి
- కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎంపీ మల్లేశం
- 'నమస్తే తెలంగాణ', తెలంగాణ టుడే, కేఎల్‌యూ ఆధ్వర్యంలో 'లక్ష్యం-2024'
- ఇంటర్ తర్వాత విద్యావకాశాలపై జనగామ ఏబీవీ, శ్రీగాయత్రి జూనియర్ కాలేజీల విద్యార్థులకు అవగాహన

పోటీ ప్రపంచంలో ముందస్తు ప్రణాళిక ఎంతో ముఖ్యమని అందుకోసం ఆత్మవిశ్వాసంతో ఎదగాలని, ఉజ్వల భవిష్యత్తుకు.. డ్యుయల్ డిగ్రీ పునాది అవుతుందని ప్రొఫెసర్ ఎంపీ మల్లేశం అన్నారు. ఉన్నత చదువులు, మెరుగైన ఉద్యోగావకాశాలు కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులకే సాధ్యమని, డిగ్రీ నాలుగేండ్లు కష్టపడి చదివితే.. 40 ఏండ్లు మంచి జీవితం అనుభవించవచ్చన్నారు. కేఎల్‌యూలో ఒకేసారి రెండు కోర్సులు చదివే అవకాశం ఉండడంతో పాటు విద్యార్థులకు ఐదు ఫారెన్ లాంగ్వేజీలపై ఉచిత శిక్షణ ఇస్తారని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో జేఈఈ బేసిక్ ఎగ్జామ్ నిర్వహిస్తారని చెప్పారు. జేయూఈఈలో 95శాతం పర్సంటైల్ సాధించిన వారికి కేఎల్ యూనివర్సిటీలో ఉచితంగా సీటు కేటాయిస్తుందన్నారు. మెరిట్ విద్యార్థులకు తమ యూనివర్సిటీ రూ.100కోట్ల స్కాలర్‌షిప్‌లు అందిస్తూ తోడ్పడుతుందని చెప్పారు. ఈ యూనివర్సిటీలో డిగ్రీ(బీ.టెక్) చదివే విద్యార్థులు ఒకేసారి రెండు కోర్సులు పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. బీటెక్ చదువుతున్నప్పుడే వారి స్కిల్స్‌ను పరిగణనలోకి తీసుకొని ఉన్నత ఉద్యోగాలు పొందేందుకు యూనివర్సిటీ అవకాశం కల్పిస్తుందని వివరించారు. రూ.60లక్షల వార్షిక ప్యాకేజీతో విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. దేశ, విదేశాల్లోనూ కేఎల్ యూనివర్సిటీకి 70 నుంచి 80 విశ్వవిద్యాలయాలతో అనుబంధం ఉందని, వారితో సంప్రదింపులు జరిపి ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు. న్యాక్ గుర్తింపుతో నాలుగు మార్కులకుగాను కేఎల్ యూనివర్సిటీకి 3.86 మార్కులు వచ్చాయన్నారు.

### వేలాది విద్యార్థుల భవిష్యత్‌కు కేఎల్ భరోసా

మైక్రోసాఫ్ట్, విప్రోతో పాటు పలు పెద్ద కంపెనీలతో సంప్రదింపులు జరిపి ప్రత్యేక సిలబస్‌తో కూడిన పుస్తకాలను సంబంధిత అధికారుల సమక్షంలో తయారు చేస్తారని వివరించారు. 1983లో ఆరంభమైన కేఎల్ యూనివర్సిటీ 40 ఏండ్లుగా వేలాది మంది విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించిందన్నారు. అనంతరం ఇంటర్ ఫస్టియర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇంటర్ తర్వాత ఎటువైపు? అనే అంశంతో అవగాహన సదస్సును ఏర్పాటు చేయడంతో ఏబీవీ, శ్రీగాయత్రి విద్యార్థులు నమస్తే తెలంగాణ దినపత్రిక యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నమస్తే తెలంగాణ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ పీ అశోక్‌కుమార్, అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ సూరి తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి విద్యార్థికి గోల్ ఉండాలి



జనగామ రూరల్ : ప్రతి విద్యార్థికి జీవితంలో ఒక గోల్ ఉండాలి. విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. వారి ఉన్నత చదువుల కోసం పట్టణాల్లో మాత్రమే గతంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేంది. ఇప్పుడు మన జనగామకు రావడం సంతోషకరం. ఇక్కడి విద్యార్థులు భవిష్యత్‌లో ఏ కోర్సులు తీసుకోవాలో ఇలాంటి కార్యక్రమాల ద్వారా తెలుస్తాయి.

–కనకరాజు, ఏబీవీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

### ఏ కోర్సులు ఉంటాయో తెలిసింది



కేఎల్ యూనివర్సిటీ నిర్వహించిన ఈ అవగాహన సదస్సు చాలా బాగుంది. ఇంటర్ తర్వాత మా భవిష్యత్ కోసం ఏ కోర్సులు తీసుకోవాలో అవగాహన కల్పించారు. చదివిన తర్వాత భవిష్యత్‌లో ఎలాంటి ప్యాకేజీలు వస్తాయనే వివరాలను తెలియజేశారు. ఈ అవకాశం రావడం నాకు ఆనందంగా ఉన్నది.

–పుల్లె మేఘన, ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్

### ఈ సదస్సు చాలా ఉపయోగపడుతుంది



లక్ష్యం కోసం మార్గం దొరికింది. అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి ఈ అవగాహన సదస్సు చక్కటి మార్గం. తర్వాత ఏ కోర్సులు తీసుకోవాలో ఈ సదస్సు మాకు చాలా ఉపయోగపడుతుంది. భవిష్యత్‌లో ఏ విధంగా ముందుకుపోవాలో అవగాహన కల్పించారు.

–మంత్రి చందన, ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్

### ఉన్నత చదువులకు పునాది



మరికొద్ది రోజుల్లో పరీక్షలు రాయనున్న క్రమంలో విద్యార్థులకు ఈ అవగాహన సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుంది. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాక, పై చదువుల కోసం ఏ కోర్సులో చేరాలో వంటి వివరాలను కేఎల్ యూనివర్సిటీ వారు అవగాహన కల్పించారు. ఇది ఉన్నత చదువులకు పునాది వంటిది. ప్రతి విద్యార్థి ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–శ్రీనివాస్, శ్రీగాయత్రి కళాశాల ప్రిన్సిపాల్

*ఎదగాలనే సంకల్పం బలంగా ఉన్నవారిని ఎవరూ ఆపలేరని ప్రొఫెసర్ ఎంపీ మల్లేశం అన్నారు. మీ లక్ష్యానికి కేఎల్ యూనివర్సిటీ గైడ్ తోడైతే గమ్యం మరింత సులభమవుతుందని చెప్పారు. భూమిలో వేసిన విత్తనాన్ని నాశనం చేసేందుకు పురుగులు, కీటకాలు ప్రయత్నిస్తుంటాయని, కానీ వాటన్నింటినీ అధిగమించి మొక్కగా ఎదుగుతుందన్నారు. ఆ తర్వాత మేకలు, గొర్రెలు తింటూ అడ్డుపడుతుంటాయని.. అయినా ఆటంకాలను తొలగించుకొని మహావృక్షంగా అవతరిస్తుందన్నారు. అలా మనం కూడా ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరికీ తెలివితేటలు ఉంటాయని వాటిని వినియోగించుకొని అందరికీ ఆదర్శంగా నిలువాలని ఆకాంక్షించారు.*

### మంచి అవకాశం



నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే పత్రికల ఆధ్వర్యంలో విద్యార్థుల భవిష్యత్ కోసం ఈ సదస్సు నిర్వహించడం చాలా సంతోషం. ప్రముఖ విద్యా నిపుణులు పలు విషయాలపై చక్కటి అవగాహన కల్పించారు. రానున్న రోజుల్లో మా భవిష్యత్ నిర్ణయించే విధంగా ఉంది. విద్యార్థులకు ఎంతో ఉపయోగం. ఎలాంటి కోర్సులు తీసుకోవాలి, చదవాలి, చదివిన తర్వాత కలిగే ప్రయోజనాలు ఏవిధంగా ఉంటాయో కేఎల్ యూనివర్సిటీ వారు వివరించారు.

–జంగిడి ప్రశాంత్, ఇంటర్ ఫస్టియర్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంపీ మల్లేశం, ఏబీవీ, శ్రీగాయత్రి కళాశాలల ప్రిన్సిపాళ్లు కనకరాజు, శ్రీనివాస్, నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్ పందిళ్ల అశోక్‌కుమార్, సిబ్బంది



వరంగల్ జడ్‌ఎస్టీసీలో మేడారం జాతర సన్నద్ధత సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

# జాతర విధులను సేవా భావంతో నిర్వర్తించాలి

- భక్తులతో మర్యాదగా మెలగాలి
- సిబ్బందికి ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సూచన
- వరంగల్ జడ్‌ఎస్టీసీలో సన్నద్ధత సమావేశం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 18: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరలో సేవాభావంతో విధులు నిర్వర్తించి, భక్తులకు రవాణా పరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సూచించారు. వరంగల్ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ (జడ్‌ఎస్టీసీ)లో ఆదివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మేడారం జాతరలో విధులు నిర్వర్తించేందుకు వచ్చినవారితో ఆర్టీసీ సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సజ్జనార్ మాట్లాడుతూ జాతరలో సిబ్బంది కేటాయించిన స్థానాల్లో మాత్రమే విధులు నిర్వర్తించాలని సూచించారు. భక్తులకు నిస్వార్థమైన సేవలందించి, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. మేడారం జాతరకు మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఉంటుందని, సిబ్బంది చాలెంజ్‌గా తీసుకుని విజయవంతం చేయాలన్నారు. జీరో ఫెయిల్యూర్స్, యాక్సిడెంట్ ఫ్రీగా జాతర జరిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిబ్బంది భక్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. జాతరలో 15వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని, వారికి వసతి సౌకర్యం, భోజన విషయంలో రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. మేడారం జాతరలో విధులు నిర్వర్తించే ఆర్టీసీ సిబ్బంది కోసం యూనియన్ బ్యాంకు సహకారంతో రూపొందించిన టీషర్ట్‌లను ఆవిష్కరించారు. ఆర్టీసీ సీవోవో డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఈడీలు మునిశేఖర్, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, రఘునాథరావు, ఆర్‌ఎం శ్రీలత పాల్గొన్నారు.





అమ్మవార్ల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



మేడారంలో భక్తుల గుడారాలు, వాహనాలు

# మేడారం.. జనసంద్రం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- ఘనంగా అమ్మవార్లకు మొక్కులు
- 10 లక్షల మంది దర్శించుకున్నట్లు అంచనా
- తల్లుల సన్నిధిలో మండలి డిప్యూటీ చైర్మన్, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్



కోడిని ఎగురవేస్తున్న మహిళ

తాడ్వాయి, ఫిబ్రవరి 18 : వనదేవతలు కొలువైన మేడారం జాతర పరిసరాలు జన సంద్రాన్ని తలపించాయి. ఆదివారం లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో అటవీ ప్రాంతం జనారణ్యంగా మారింది. రోజంతా భక్తుల రాకపోకలతో మేడారం దారులు కిక్కిరిసిపోయాయి. జాతర పరిసరాలు భక్తుల గుడారాలతో నిండిపోయాయి. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి జంపన్నవాగులో పుణ్యస్నానాలాచరించి, వాగు ఒడ్డునున్న జంపన్న, నాగులమ్మ గద్దెలకు మొక్కులు చెల్లించి కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. అనంతరం తల్లుల గద్దెలకు చేరుకొని పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం (బెల్లం), నూతన వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లా పాపలను చల్లంగా చూడాలని కోరుకున్నారు.

### అమ్మవార్లను దర్శించుకున్న ప్రముఖులు

వనదేవతలు సమ్మక్క సారలమ్మలను ఆదివారం మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవార్ల దర్శనానికి వచ్చిన వారు సమ్మక్క, సారలమ్మ, గోవింద రాజు, పగిడిద్దరాజుల గద్దెలపై గిరిజన సంప్రదాయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.



మేడారంలో రోప్ పార్టీ బృందానికి శిక్షణ ఇస్తున్న పోలీసు అధికారులు



### 50 లక్షల మంది ముందస్తు మొక్కులు

ములుగు (నమస్తే తెలంగాణ) : మేడారం సమ్మక్క, సారలమ్మకు రెండు నెలల నుంచి 50 లక్షల మంది భక్తులు ముందస్తుగా మొక్కులు చెల్లించారని ములుగు ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24 వరకు మరో కోటి మంది భక్తులు వచ్చే అవకాశముందన్నారు. మహా జాతరకు పోలీస్ శాఖ పూర్తి సన్నద్ధమైందని, జిల్లా యంత్రాంగంతో మమేకమై పని చేస్తున్నామని ఎస్పీ వెల్లడించారు.





యాప్‌లో జాతరలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు తెలిపే ఫొటోలు

### భక్తులకు గైడ్..

# మై మేడారం యాప్..

- అందుబాటులో మౌలిక వసతుల వివరాలు
- జాతర ముఖ్య ఘట్టాల సమాచారం
- ఆవిష్కరించిన మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు వచ్చే భక్తులకు రోజు రోజుకూ సౌకర్యాలు మెరుగు పడుతున్నాయి. ప్రస్తుత సాంకేతిక యుగంలో ప్రతి విషయాన్ని ఆన్‌లైన్‌లో సెల్‌ఫోన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 'మై మేడారం యాప్'ను శనివారం మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ డాక్టర్ అంబరీష్ ఆవిష్కరించారు. ఎడ్లబండి నాటి నుంచి గాలి మోటర్ వరకు వచ్చిన సౌకర్యాలతో పాటు ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే జాతరలో కల్పిస్తున్న మౌలిక వసతులు, ముఖ్య ఘట్టాల సమాచారాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్లే స్టోర్ నుంచి ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. జాతరలో ఏర్పాటు చేసిన తాగునీటి కేంద్రాలు, వైద్య శిబిరాలు, పార్కింగ్ ప్రాంతాలు, మరుగుదొడ్లు, స్నానఘట్టాలు, తప్పిపోయిన వారి కోసం మైక్‌ల ద్వారా పిలిచే కేంద్రాలు, ఫైర్ ఇంజిన్ కేంద్రాలు తదితర మౌలిక వసతుల వివరాలను ఈ యాప్‌లో పొందుపర్చారు. అలాగే మొదటి రోజు సారలమ్మ, రెండో రోజు సమ్మక్క ఆగమనం, మూడో రోజు భక్తులు మొక్కులు చెల్లించే విధానం, నాలుగో రోజు తల్లుల వనప్రవేశం వివరాలను పొందుపర్చారు.